నూతన సొబగులు

- ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు
- గణనీయంగా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- జోరుగా నాడు – నేడు రెండో విడత పనులు



సుందరంగా అల్లీపురం జెడ్పీ హైస్కూల్ భవనం

నెల్లూరు రూరల్: గత ప్రభుత్వాల హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని విస్మరించారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టేది. అరకొర వసతులతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులూ అవస్థ పడేవారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో నాడు – నేడు పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆయా పాఠశాలల్లో అవసరమైన మేరకు వసతులను కల్పించేందుకు తగిన ప్రణాళికలను రూపొందించి మొదటి విడత పనులను పూర్తి చేశారు. ప్రస్తుతం రెండో విడత పనులు జోరుగా జరుగుతున్నాయి.

200 ప్రభుత్వ పాఠశాలలు

నెల్లూరు అర్బన్, రూరల్ ప్రాంతాల్లో దాదాపు 200 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 142 ప్రాథమిక, 16 ప్రాథమికోన్నత, 18 జెడ్పీ ఉన్నత, 16 నగరపాలక సంస్థ ఉన్నత, రెండు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక గిరిజన సంక్షేమ పాఠశాల ఉన్నాయి. ఇక్కడ కల్పించిన మౌలిక వసతులతో విద్యార్థుల సంఖ్య రెండేళ్లగా పెరుగుతోంది.



విద్యుత్ వైరింగ్ పనులు



గాంధీనగర్‌లోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో..

మొదటి విడతలో ఇలా..

నాడు – నేడు మొదటి విడతలో గతేడాది 82 స్కూళ్లలో వసతులకు ప్రణాళికలను సిద్ధం చేసి పనులను మంజూరు చేశారు. దీనికి గానూ రూ.22.24 కోట్లను కేటాయించారు. ఇందులో దాదాపు రూ. 21.68 కోట్ల మేర వెచ్చించారు.

రెండో విడతలో..

రెండో విడత పనులకు గానూ ఈ ఏడాది 150 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటికి రూ.68.92 కోట్లను కేటాయించగా, ఇప్పటివరకు రూ.15.17 కోట్లను విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణలనూ చేపడుతున్నారు. ఆయా పాఠశాలల్లో ప్రహరీలు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, పెయింటింగ్, మైనర్, మేజర్ పనులు, ఫర్నిచర్ ఏర్పాటు, గ్రీన్ చాక్ బోర్డులు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, తదితర వసతులను సమకూరుస్తున్నారు. ఆయా పాఠశాలల్లోని పరిస్థితుల ఆధారంగా పనులు చేపడుతున్నారు.

పూర్తి స్థాయి నాణ్యత ప్రమాణాలు

కాంట్రాక్టర్ల ప్రమేయం ఏ మాత్రం లేకుండా పనులను చేపట్టారు. సర్వశిక్ష ప్రాజెక్ట్ అధికారి పర్యవేక్షణలో తొమ్మిది మంది ఇంజినీరింగ్ ఏఈలు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆయా పాఠశాలల పేరెంట్స్ కమిటీ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యుల భాగస్వామ్యంతో పనులు చేపడుతున్నారు. మంజూరైన అనంతరం పనులను ప్రారంభించేందుకు 15 శాతం నిధులను విడుదల చేస్తారు. అనంతరం మరో రెండు విడతల్లో నిధులను ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమచేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారుతున్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో విద్యాబోధన జరుగుతోంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ మరింత పెరుగుతోంది.

పూర్తి స్థాయి వసతులు



గతంలో మా పాఠశాలలో అరకొర వసతులు ఉండేవి. దీంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుతం ఆహ్లాదకర వాతావరణంలో పూర్తి స్థాయి వసతులతో చదువుకుంటున్నాం. ఫర్నిచర్, ఫ్యాన్లు ఉండటంతో తరగతి గదులు సౌకర్యవంతంగా ఉన్నాయి.

– చరణ్, పదో తరగతి విద్యార్థి, అల్లీపురం జెడ్పీ హైస్కూల్

కార్పొరేట్ కన్నా మిన్నగా



కార్పొరేట్ కన్నా ఎంతో మిన్నగా ప్రభుత్వ పాఠశాలలు ఉంటున్నాయి. చక్కటి విద్యాబోధన అందుతోంది. అన్ని వసతులను సమకూర్చారు.

– లిఖిత, పదో తరగతి విద్యార్థి, అల్లీపురం జెడ్పీ హైస్కూల్

ముమ్మరంగా నాడు – నేడు పనులు



అల్లీపురం జెడ్పీ హైస్కూల్లో మొదటి విడతలో రూ.42 లక్షలతో నాడు – నేడు పనులను పూర్తి చేశాం. ప్రస్తుతం రెండో విడతలో ఆరు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.72 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో మూడు గదుల నిర్మాణం పూర్తయింది.

–నారాయణరావు, ప్రధానోపాధ్యాయుడు, అల్లీపురం జెడ్పీ హైస్కూల్

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులేస్తోంది. రూరల్, అర్బన్ ప్రాంతాల్లోని పాఠశాలల్లో రెండో విడత నాడు – నేడు పనులు జరుగుతున్నాయి. పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించడమే విద్యాశాఖ లక్ష్యం.

– తిరుపాల్, ఎంఈఓ, నెల్లూరు

క్లుప్తంగా

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(బృందావనం): టీవీఎస్ కల్యాణ సదన్ ఆధ్వర్యంలో జిల్లాలోని బ్రాహ్మణ విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 100 మంది విద్యార్థులకు రూ.6.25 లక్షల నగదును అందజేశారు. సుజాతమ్మకాలనీలోని శ్రీకృష్ణయోగ మందిరం ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి శ్రీగణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞాన బోధ సభ ట్రస్ట్ నెల్లూరు శాఖ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటర్మీడియట్ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేయడం అభినందనీయమన్నారు. టీవీఎస్ కల్యాణ సదన్ మేనేజింగ్ ట్రస్టీ డీ ఫణిరత్నం, ట్రస్టీలు పీ రాఘవేంద్రరావు, నాగదేవి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖరరెడ్డిని ఆశీర్వదించండి



నెల్లూరు (వేదాయపాళెం) : తూర్పురాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగాపోటీ చేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డికి విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు ప్రకటించి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం విద్యార్థి జేఏసీ, బీసీ విద్యార్థి సంఘం, సమాజ్‌వాదీ లోహియా నాయకులు పొదలకూరు రోడ్డు జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాల, తదితర పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలుసుకుని బ్యాలెట్ పత్రాలను అందజేసి చంద్రశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ మురళీకృష్ణ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ లోహియా నాయకుడు హరీష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



నెల్లూరు (టౌన్): తూర్పురాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి అభ్యర్థి ఎల్‌సీ రమణారెడ్డి పేర్కొన్నారు. మద్రాసు బస్టాండ్ సెంటర్‌లోని ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తూర్పురాయలసీమ నియోజకవర్గ పరిధిలోని చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 39 ఉపాధ్యాయ సంఘాలు తనకు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. ఈ జిల్లాల పరిధిలోని 1100 విద్యా సంస్థల్లోని దాదాపు 15వేల మంది ఉపాధ్యాయులను పత్యక్షంగా కలిశామన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు తనకు తొలి ప్రాధాన్యత ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కళాశాల వ్యాన్‌ను ఢీకొన్న లారీ

- విద్యార్థులకు తప్పిన ప్రమాదం



వ్యానును ఢీకొన్న లారీ

వెంకటాచలం : నారాయణ నర్సింగ్ కళాశాల వ్యాన్‌ను లారీ ఢీకొన్న సంఘటన వెంకటాచలంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. ఈ ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదు. నెల్లూరు నుంచి వెంకటాచలం వైపు వెళ్తున్న వ్యాన్‌ను సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద లారీ ఢీకొంది. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న వెంకటాచలం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేర్నాటిని దీవించండి



నెల్లూరు రూరల్: తూర్పురాయలసీమ నియోజకవర్గ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని దీవించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. రూరల్ పరిధిలోని 31వ డివిజన్‌లోని రామకోటయ్యనగర్‌లో పేర్నాటికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులకు బ్యాలెట్ పత్రాలను అందజేస్తూ ఓట్లను అభ్యర్థించారు. పార్టీ నాయకులు కమల్, నవీన్‌రెడ్డి, ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి, గౌస్, చంద్రారెడ్డి, రాజా, చిరంజీవి, బాబు, కాలేషా, కామక్షమ్మ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ దగ్ధం



నెల్లూరు రూరల్: హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలి టిప్పర్ దగ్ధమైన ఘటన కనుపర్తిపాడు సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు..వేణుగోపాల్ నాయుడుకు చెందిన టిప్పర్ నెల్లూరు–గొలగమూడి రోడ్డు పక్కన గ్రావెల్‌ను అన్‌లోడ్ చేస్తుండగా హైటెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో విద్యుత్ సర్క్యూట్ జరిగింది. హైడ్రాలిక్ ఆయిల్‌కు మంటలు అంటుకుని చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ప్రత్యేక లిక్విడ్‌ను ఉపయోగించి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో టిప్పర్ టైర్లతో పాటు హైడ్రాలిక్ పరికరాలు కాలిపోయాయి. కాగా ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తోంది.

సావిత్రీబాయి పూలే ఆదర్శప్రాయురాలు



సావిత్రీబాయికి నివాళులర్పిస్తున్న డీఈఓ



బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో..

నెల్లూరు (టౌన్): మహిళా విద్యా కోసం పాటుపడిన సావిత్రీబాయి పూలే ఆదర్శప్రాయురాలని డీఈఓ గంగాభవాని పేర్కొన్నారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సావిత్రీబాయి పూలే వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. డీఈఓ గంగాభవాని ముఖ్య అతిథిగా హాజరై సావిత్రీబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలేను మహిళా ఉపాధ్యాయినులు ఆదర్శంగా తీసుకుని స్త్రీ విద్య కోసం అంకితభావంతో పనిచేయాలన్నారు. ఏపీ ఉషారాణి, ఏడీ గ్లోరికుమారి, బీటీఏ వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, జిల్లా అధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు ప్రసాద్, ఖాజారహ్మతుల్లా, మల్లికార్జున, రాజమనోహర్, వెంకటేశ్వర్లు, గోపాలరాజు పాల్గొన్నారు.

నెల్లూరు (వేదాయపాళెం) : సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ జిల్లా కార్యాలయంలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య, నాయకులు జయరామరాజు, విజయ్ కుమార్, మాధవరాజు, విజయ్ పాల్గొన్నారు.

నగర ఎమ్మెల్యే అనిల్‌కు సన్మానం



నెల్లూరు రూరల్: నగర ఎమ్మెల్యే పీ అనిల్ కుమార్‌యాదవ్‌ను ఆయన నివాసంలో ముస్లిం మైనార్టీ నేతలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సిద్దిక్ ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, వక్ఫ్ బోర్డు చైర్మన్ మీరా, కార్పొరేటర్లు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

డ్వామాలో సోషల్ ఆడిట్

నెల్లూరు (పొగతోట): కోవూరు మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్‌ను డ్వామా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. డ్వామా అధికారులు ఉపాధి హామీ పనుల రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో కోవూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించాల్సిన సోషల్ ఆడిట్‌ను డ్వామా కార్యాలయంలో నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

సైలెన్సర్ల తొలగింపు



నెల్లూరు(క్రైమ్): నగరంలో శబ్దకాలుష్యం చేస్తున్న వాహనాలపై సౌత్ ట్రాఫిక్ ఆర్ఎస్సై చంద్రమౌళి ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద అధిక శబ్దం చేసే బైక్‌ల సైలెన్సర్లను తొలగించి వాహనదారులకు అపరాధ రుసుం విధించారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా



వాలీబాల్ ఆడుతున్న మహిళలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శుక్రవారం మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత క్రీడా పోటీలను సెట్నల్, డీఎస్‌ఏ ముఖ్య కార్యనిర్వహణాధికారి డీ పుల్లయ్య, డీఎస్‌ఏ చీఫ్‌కోచ్ ఆర్కే యతిరాజ్ ప్రారంభించారు. బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని విద్యార్థినులు, వెటరన్ క్రీడాకారిణులు 90 మంది పోటీల్లో పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో భాగంగా శనివారం ఉదయం 7 గంటలకు కబడ్డీ, ఖోఖో, గ్రామీణ, సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌ఏ ముఖ్య కార్యనిర్వహణాధికారి డీ పుల్లయ్య తెలిపారు.

హెచ్‌టీ వినియోగదారులకు సంతృప్తికర సేవలు



మాట్లాడుతున్న ఎస్ఈ వెంకటసుబ్బయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని 697 హెచ్‌టీ విద్యుత్ సర్వీసులు కలిగిన వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందిస్తున్నామని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఆదేశాల మేరకు నగరంలోని విద్యుత్‌భవన్‌లో హెచ్‌టీ విద్యుత్ వినియోగదారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. వినియోగదారుల సమస్యలను తెలుసుకున్నారు. నాయుడుపేటకు చెందిన ఎస్ఎల్ఆర్ గ్రీన్‌టెక్ సంస్థ ప్రతినిధులు పీరియడికల్ టెస్టింగ్‌పై ఉన్న సందేహాలను ఎస్ఈను అడిగి తెలుసుకున్నారు. సోలార్ బిల్లింగ్‌కు సంబంధించిన ఇన్‌పుట్, అవుట్‌పుట్ రీడింగ్‌లో వచ్చే సమస్యలను ఎస్ఈ దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెచ్‌టీ వినియోగదారులు సమస్యలను తనకు నేరుగా గానీ లేదా వాట్సాప్ ద్వారా గానీ తెలియజేస్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్‌రెడ్డి, కృష్ణప్రసాద్, ఇస్మాయిల్, జయకృష్ణారెడ్డి, జనార్దన్, పరంధామయ్య, విజయ్‌కుమార్ రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ విజిత, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీధర్, సురేష్, కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



కూరగాయల మార్కెట్‌ను తనిఖీ చేస్తున్న ఏడీ

నెల్లూరు(సెంట్రల్): తూకాల్లో మోసాలకు పాల్పడితే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత హెచ్చరించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలుదారులకు ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. కొనుగోలుదారులకు ఎవరైనా వ్యాపారులు ఇబ్బందులు కలిగిస్తే చర్యల తప్పవని హెచ్చరించారు. ధరల పట్టికను ఏర్పాటు చేసి అందుకనుగుణంగానే కూరగాయల విక్రయాలు జరపాలని ఆదేశించారు. తూకాల్లో మోసాలకు పాల్పడినా, షాపుల ఆక్రమణలు చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో స్వామివారి కల్యాణం శుక్రవారం కమనీయంగా జరిగింది. తొలుత అమ్మవార్లకు అభిషేకాలు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహన చోదకుడు గాయాలపాలైన ఘటనపై సౌత్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు..క్రాంతినగర్‌కు చెందిన సాయితేజ ఈ నెల 5న తనబైక్‌పై కొత్తూరుకు బయలుదేరాడు. డైకస్‌రోడ్డు జేకే కాలనీ వద్దకు వచ్చేసరికి కారు వేగంగా వచ్చి అతనిని ఢీకొంది. ఈ ఘటనలో ఆయనకు గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితుడి భార్య అశ్విని సౌత్‌ట్రాఫిక్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని జనార్దన్‌రెడ్డికాలనీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఈస్ట్–1 విద్యుత్ శాఖ ఏఈ మన్మధరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతుండడంతో పాటు నూతనంగా నిర్మిస్తున్న ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం 11 కేవీ విద్యుత్‌లైన్లను లాగుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. వెంకటేశ్వరపురం, గాంధీగిరిజనకాలనీ, జనార్దన్‌రెడ్డికాలనీ, టిడ్కో అపార్టుమెంట్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

- డీఎస్సార్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గౌతమినగర్ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు. గౌతమినగర్ 1,2 వీధులు, నేతాజీ నగర్, బ్యాంకుకాలనీ, రామచంద్రమిషన్ రోడ్డు,సూర్యప్రకాష్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.
- హరనాథపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పార్థసారథినగర్, 'సాక్షి' దినపత్రిక విద్యుత్ ఫీడర్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఏఈ దామోదరరెడ్డి శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పార్థసారథినగర్, ఆకుతోట హరిజనవాడ, డీఎస్కే గార్డెన్, కేవీకంద్రిక, నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, సాక్షి దినపత్రిక ప్రధాన కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.
- ఎన్టీఆర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సరస్వతీనగర్ విద్యుత్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని స్టోన్‌హౌస్‌పేట ఏఈ సుకుమార్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఏసీనగర్, శ్రీనగర్‌కాలనీ, బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్, ముగ్గురాళ్ల సందు, శ్రీరంగరాజపురం, కుసుమ దళితవాడ, పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.
- శెట్టిగుంటరోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఈస్ట్–1 ఏఈ మన్మధరావు శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన పరిధిలోని శెట్టిగుంటగరోడ్డు, మూడోమైలు, కిసాన్‌నగర్, శ్రీనివాసనగర్, అయ్యప్పగారితోట పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని వినియోగదారులు సహకరించాలని కోరారు.